క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం నేడు

అనుమసముద్రంపేట: మండల పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

పశువైద్యశిబిరం



మర్రిపాడు: మండలంలోని బూదవాడలో ఎస్ఎన్ఆర్డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పశువైద్యశిబిరం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎస్ జయచంద్ర 15 గేదెలకు గర్భకోశ పరీక్షలు చేశారు. 77 లేగదూడలు, 220 జీవాలకు నట్టల నివారణ మందులు అందజేశారు. స్వచ్ఛంద సంస్థకు చెందిన సుబ్బరాజు, ఆంటోని, ఏహెచ్ఏలు శ్రీనివాసులు, రామకృష్ణ, కంపసముద్రం వెటర్నరీ అసిస్టెంట్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సమావేశం



ఉదయగిరి: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షురాలు పీ విజయలక్ష్మి అధ్యక్షతన మండల కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ నెల 13న పార్టీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ నెల్లూరు వస్తున్న నేపథ్యంలో ఉదయగిరి ప్రాంత అభివృద్ధికి సంబంధించి వినతిపత్రం అందజేసే విషయమై చర్చించారు. ఉదయగిరి పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించేలా చొరవచూపాలని అధ్యక్షుడిని కోరాలని నిర్ణయించారు. పార్టీ నేతలు గడ్డం మాధవ, ఎం శ్రీనివాసులు, పీ నారాయణరెడ్డి, మూల మాధవరెడ్డి, శశిరేఖ, శ్రీహరి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ.226

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు సగటు ధర రూ.226 పలికింది. వేలానికి 309 బేళ్లు రాగా, 173 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.150, సగటున రూ.226.72 ధర పలికిందని వివరించారు. వేలంలో పది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కలిగిరిలో 111 బేళ్ల విక్రయం

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం 111 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 224 బేళ్లను తీసుకురాగా, 111 బేళ్లను విక్రయించినట్లుగా చెప్పారు. వేలంలో కిలోపొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.150, సగటున రూ.220.54 ధర పలికిందని వివరించారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



కావలి (జలదంకి): కావలిలోని కావేరిగుంట గిరిజన కాలనీలోని గిరిజనులకు డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. కావలి ఐసీఐసీఐ బ్యాంకు అధికారి సుభాన్ తన తల్లి హుస్సేన్‌బీ వర్ధంతిని పురస్కరించుకుని గిరిజనులకు దుప్పట్లు అందజేశారు. డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఐసీఐసీఐ బ్యాంకు ఈక్విటీ మేనేజర్ వెంకట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారి దిలీప్, తులసి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి రూ.1.06 కోట్లు మంజూరు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.1.06 కోట్లు మంజూరు చేసినట్లుగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆత్మకూరులోని ఎంపీపీ వెస్ట్ పాఠశాలకు రూ.35.20 లక్షలు, మర్రిపాడు మండలం నందవరం ఆదర్శ పాఠశాలకు రూ.15 లక్షలు, కేతిగుంటపల్లిపాడు ఎంపీపీ పాఠశాలకు రూ.13.05లక్షలు, మర్రిపాడు ఎంపీపీడబ్ల్యూ పాఠశాలకు రూ.11.05 లక్షలు, అనుమసముద్రంపేటలోని ఆదర్శ పాఠశాలకు రూ.15 లక్షలు, హిందూ ఎంపీపీ పాఠశాలకు రూ.5.9 లక్షలు, అనంతసాగరంలోని ఎంపీపీ పాఠశాలకు రూ.8.05 లక్షలు, చేజర్ల మెయిన్ ఎంపీపీ పాఠశాలకు రూ.3 లక్షలు మంజూరయ్యాయని వివరించారు. ఈ విద్యా సంవత్సరంలోనే పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ జాగా.. వేసేయ్ పాగా

ప్రభుత్వ భూములపై తమ్ముళ్ల కన్ను

- దర్జాగా ఆక్రమించి నిర్మాణాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



గానుగపెంటలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణం



తూర్పుయర్రబల్లిలో వాగుపోరంబోకులో ఏర్పాటు చేసిన సిమెంట్ బ్రిక్స్ యూనిట్

కొండాపురం: మండలంలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. విలువైన ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించుకుని నిర్మాణాలు సైతం చేపడుతున్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

మండలంలో వాగు పోరంబోకు, మేత పోరంబోకు, అసైన్‌మెంట్ రూపంలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే కొందరు టీడీపీ నాయకులు, వారి అనుచరులు ప్రభుత్వ భూములపై కన్నేసి దర్జాగా కబ్జా చేస్తున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూమి కనిపిస్తే పాగా వేసేసి అక్రమిస్తున్నారు. ప్రధానంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అనుచరులు ఈ తంతుకు దిగుతున్నారు. ఆక్రమణదారులు ఎవరైనా సరే స్థానిక టీడీపీ నాయకులు అండగా ఉండి వారి వద్ద ముడుపులు తీసుకుని ఈ తంతును నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాగు పోరంబోకులను సైతం ఆక్రమించి సాగు చేస్తుంటే చెరువులు ఎండిపోయే ప్రమాదం ఉందని, గేదెలను మేపుకునేందుకు జానెడు స్థలం కూడా లేకుండా పోతుందని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఇటీవల గానుగపెంట పంచాయతీలో సర్వే నంబర్ 18లోని వాగు పోరంబోకు సుమారు రెండున్నర ఎకరాలను మెంటా సుధాకర్ అనే వ్యక్తి ఆక్రమించాడు. అందులో అక్రమ కట్టడాలు సైతం చేపట్టారు. గ్రామస్తుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు సర్వే చేయించి వాగుపోరంబోకుగా గుర్తించారు. హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయగా ఆక్రమణదారులు తొలగించారు. అంతటితో ఆగకుండా ఆక్రమణదారుడు అందులో సీసీకెమెరాలు సైతం ఏర్పాటు చేశాడు. ఆక్రమణదారుడిపై రెవెన్యూ అధికారులు కొండాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అదే పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 120లోని వాగుపోరంబోకును కొందరు రైతులు ఆక్రమించి సాగుకు సిద్ధం చేశారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
- తూర్పుయర్రబల్లిలో సర్వేనంబర్ 508లోని వాగు పోరంబోకును అధికార పార్టీ నాయకుల అండదండలతో ఆక్రమించి సిమెంట్‌బ్రిక్స్‌ను తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ విషయమైన పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని విడిపించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సురేష్‌ను వివరణ కోరగా నూతనంగా బాధ్యతలు స్వీకరించాలని, ఆక్రమణలను పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మర్రిపాడు: మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని ఇస్కపల్లికి చెందిన రమణయ్య తన బైక్‌పై గంగమ్మ, వైష్ణవి, చిన్నపాపతో కలిసి బద్వేల్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో జిల్లా సరిహద్దులోని అటవీప్రాంతం వద్ద నెల్లూరు నుంచి బద్వేల్ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న రమణయ్య, గంగమ్మ, వైష్ణవితో పాటు చిన్నపాపకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో కారు, బైక్ బాగా దెబ్బతిన్నాయి. మర్రిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు

ఆత్మకూరు: డీఎంఅండ్‌హెచ్ఓ సుజాత ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని ప్రైవేట్ ఆస్పత్రులను యూపీహెచ్‌సీ డాక్టర్ ఎస్‌కే అస్మా తన సిబ్బందితో కలిసి శనివారం తనిఖీ చేశారు. పట్టణంలోని శ్రీవారి ఆస్పత్రి, అభిరామ్ ఆస్పత్రి, డాక్టర్ ఆదిశేషయ్య, డాక్టర్ అనంత్ చిన్నపిల్లల ఆస్పత్రులు, ప్రైవేట్ ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లను సందర్శించి రిజిస్ట్రేషన్లు, రెన్యువల్, పొల్యూషన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆస్పత్రుల్లోని ల్యాబ్‌ల్లోని పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర మందులు ఏ మేరకు స్టాక్ ఉన్నాయని పరిశీలించారు. ఆపరేషన్ గదులను పరిశీలించి మరింత పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి నమోదు చేసుకున్నారు. కొన్ని ఆస్పత్రుల్లోని ఎమర్జెన్సీ వార్డులో ఉన్న రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు.



ప్రైవేట్ ఆస్పత్రిలోని మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న డాక్టర్ అస్మా

వీఆర్ఏలకు పేస్కేల్‌ను అమలు చేయాలి



వింజమూరు(ఉదయగిరి): గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్‌ను అమలుచేసి ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు లచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన వీఆర్ఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఆర్ఏలకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, వీఆర్వోలుగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో వీఆర్ఏలకు పేస్కేల్‌ను అమలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బీ సుందరయ్య, మండలాధ్యక్షుడిగా షేక్ ఖాదర్ బాషా, ఉపాధ్యక్షురాలిగా ఉప్పరపల్లి పెంచలమ్మ, కోశాధికారిగా రాంబాబును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జీ ఓబులేసు, జిల్లా నేతలు ఎం రామయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులతో రక్తహీనత



కలిగిరి: నులి పురుగులతో చిన్నారుల్లో రక్తహీనత తలెత్తుతుందని, వాటి నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలను మింగించాలని కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి సూచించారు. కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ ఈ నెల 12న మండలంలోని 1 నుంచి 2 ఏళ్లలోపు పిల్లలకు అల్బెండాజోల్ 200 ఎంజీ, 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు అల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలను మింగించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. పీహెచ్‌ఎన్‌ఎఫ్ఎస్ మేరీ, హెల్త్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి, ఫార్మాసిస్ట్ విజయ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీనివాసుని కల్యాణం



శ్రీనివాసుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

ఉదయగిరి: పట్టణంలోని పురాతన రంగనాయకుల స్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ అధ్వర్యంలో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని శనివారం కనులపండువగా నిర్వహించారు. తొలుత మర్రిపాడులోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి నివాసం నుంచి ప్రత్యేక వాహనంలో శ్రీవారి ఉత్సవమూర్తిని ఉదయగిరిలోని ఆనకట్ట ప్రాంగణానికి తీసుకొచ్చారు. అనంతరం సంప్రదాయబద్ధంగా స్వామి వారిని మేళతాళాలు, బాణసంచా పేలుళ్లు, కోలాట ప్రదర్శనల నడుమ ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు చేర్చారు. వేదపండితులు కల్యాణ మూర్తులను సర్వాంగాసుందరంగా అలంకరించి కళ్యాణ వేదికపై ఆశీనులను చేసిసంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణ ఘట్టం కమనీయం, రమణీయంగా సాగుతుండగా.. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దంపంతులు కల్యాణ తంతును నిర్వహించారు. భక్తులు స్వయంగా తమ హస్తలతో వలిచి తెచ్చిన బియ్యాన్ని తలంబ్రాలుగా వినియోగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ వక్త పర్రె కోటేశ్వరరావు వ్యాఖ్యతగా వ్యవహరించారు. నెల్లూరు ఆర్టీసీ రీజీయన్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నేతలు, పట్టణ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



భక్తుల కోలాట ప్రదర్శన

రోడ్డుపైనే మురుగు ప్రవాహం



వింజమూరు(ఉదయగిరి): స్థానిక నేతాజీ వికాస్ కళాశాలకు వెళ్లే మార్గంలో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. డ్రైనేజీ దెబ్బతినడంతో మురుగు రోడ్డు మీదుగా అవతలకు ప్రవహిస్తోంది. దీంతో విద్యార్థులు,స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు డ్రైనేజీ పూడికతో నిండడంతో మురుగు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు సైతం వృద్ధి చెంది స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. పంచాయతీ పాలకులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వేడుకగా రక్షబంధన్

సీతారామపురం/కొండాపురం: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని రక్షాబంధన్‌ను శనివారం వేడుకగా జరుపుకొన్నారు. జీవితకాలం సుఖసంతోషాలతో జీవించాలని సోదరులకు సోదరీలు రాఖీలను కట్టి ఆశీర్వదించారు. అనంతరం స్వీట్లు తినిపించారు.



సీతారామపురంలో తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రూత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 34 సీట్లు ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు అర్హులని తెలిపారు. అర్హులైన వారు 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 16వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వివరాలకు 87126 25046 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి రూరల్: మండలంలోని కృష్ణంపల్లెలోని రామాలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు ఉదయం వసంతోత్సవం, ఉట్టి మహోత్సవాలను నిర్వహించారు. సాయంత్రం పారువేట ఉత్సవాన్ని నిర్వహించారు. సీతారాములను అశ్వ వాహనంపై కొలువుదీర్చి గ్రామ సమీపంలోని వనంలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వృక్షాబంధన్



ఆత్మకూరు: పట్టణంలో ఆర్‌ఎస్‌ఎస్, ఏపీ స్వదేశీ జాగరణ మంచ్ పర్యావరణ ప్రముఖ్ నెల్లూరు కృష్ణారెడ్డి, గడ్డం వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రక్షాబంధన్‌ను శనివారం వినూత్నంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస పాఠశాలలో వృక్షాబంధన్ పేరుతో విద్యార్థినులతో చెట్లకు రాఖీలను కట్టించి వాటిని సంరక్షించే బాధ్యతను అప్పగించారు. పర్యావరణ పరిరక్షణలో చెట్ల పాత్ర కీలకమని, ప్రతిఒక్కరూ చెట్లను పెంచాలని పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ ఖండ సహ కార్యవాహ బూదళ్ల వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థల పరిశీలన



అల్లూరు: అల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌కు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేస్తామని నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. అల్లూరు ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో గత 15 ఏళ్లుగా 2.5 ఎకరాల స్థలం నిరుపయోగంగా ఉండడం బాధాకరమైన విషయమన్నారు. నూతన బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండ్‌ను అన్ని సౌకర్యాలతో ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఆయన వెంట నాయకులు డీ హరిరెడ్డి, కృష్ణచైతన్య, కిరణ్‌నాయుడు, మల్లిసింగ్, కే విజయ్, శీనయ్య తదితరులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లతో తీవ్ర నష్టం

ఉదయగిరి రూరల్: పాత విద్యుత్ మీటర్ల స్థానంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లతో ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ బిజ్జంపల్లెలో సీపీఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో శనివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాకు వెంకటయ్య మాట్లాడుతూ ప్రజలు అడగని స్మార్ట్ మీటర్లను కూటమి ప్రభుత్వం ఎవరి కోసం బిగిస్తుందో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల ముందు లోకేశ్‌బాబు స్మార్ట్ మీటర్లను పగుల గొట్టాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రతి ఇంటికి బలవంతంగా బిగిస్తుండడం సిగ్గుచేటన్నారు. ఆదాని కంపెనీకి లాభం చేకూర్చేందుకే కూటమి ప్రభుత్వం ఇలా వ్యవహరించడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లతో విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయన్నారు. ఇప్పటికే షాపులకు బిగించడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. స్మార్టు మీటర్లను అన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా మన రాష్ట్ర ప్రభుత్వం వాటికి అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. స్మార్ట్‌మీటర్లను పార్టీలకతీతంగా ప్రజలు వ్యతిరేకించాలన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ఉపాధి కూలీలకు రావాల్సిన నగదు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



బిజ్జంపల్లెలో ఆందోళన చేపడుతున్న ప్రజలు

వైభవంగా కాశీవిశ్వేరుని విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

సంగం: మండలం పెరమనలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా శనివారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతి హోమం, స్వస్తివాచనం, మండప మూలమూర్తి హోమాలు, ఆలయ బలిపీఠ పూజ, ఘర్తన్యాసం, సుముహూర్తానికి యంత్రస్థాపన, రత్నన్యాస పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠాపనాచార్యులు కాండూరి రాజీవ్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. చివరిగా కళాన్యాసం, మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ దగుమాటి కామాక్షమ్మ, మధురెడ్డి దంపతులు, వైఎస్సార్సీపీ నేతలు బసిరెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదనయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి విశేష పూజలు

సంగం : శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. పీఠాధిపతి రాజరాజేశ్వరనందస్వామి ఆధ్వర్యంలో దేవదేవేరులకు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ చేశారు. అనంతరం గణపతి పూజ లలితా సహస్ర నామార్చన, హోమం నిర్వహించారు. భక్తులకు ప్రాణాయామం, శ్రీరామ క్రియా ధ్యానంపై భక్తులకు పీఠాధిపతి అవగాహన కల్పించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

